రత్నానగర్‌లో రూ. 7 లక్షలతో తాగునీటి పైపులైన్



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత

నల్లకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లో పెండింగ్ పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం రత్నానగర్‌లో రూ. 7 లక్షల వ్యయంతో చేపట్టిన తాగు నీటి పైపులైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ అమృతతో కలిసి ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎం.మధుసూదన్ యాదవ్, రత్నానగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు పి.ఈశ్వర్, ఉపాధ్యక్షుడు పింజారి నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి కిషోర్, కార్యదర్శి వీరయ్యగౌడ్, కోశాధికారి సతీష్ చంద్రగౌడ్, అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం

● యజమానిపై చర్యలు తీసుకోవాలి : కార్పొరేటర్



న్యూబాకారంలో నిర్మిస్తున్న భవనం

ముషీరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): న్యూ బాకారంలో నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మిస్తున్న యజమానిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్ తాహా డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణానికి జీ ప్లస్ టూ అనుమతి తీసుకొని జీ ప్లస్ ఫోర్ నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. సెట్‌బ్యాక్ లేకుండా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి భవన నిర్మాణ పనులు చేపట్టడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు నోటీసులు ఇచ్చినా భవన యజమాని పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శ్మశానవాటికలో చెత్తకుప్పలు తొలగించాలి

రాంనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ శ్మశాన వాటికలో పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పలు తొలగించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు తిరుమల్‌రావు కోరారు. జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ -15 డీఎంసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్యను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు గోపాల్‌దాస్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయ నిర్మాణానికి రూ. 50 వేల విరాళం



ముఠా జైసింహ చేతుల మీదుగా నగదు అందజేస్తున్న అనీష్ గంగపుత్ర

ముషీరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లో ప్రసిద్ధిగాంచిన మహంకాళి అమ్మవారి దేవాలయ అభివృద్ధికి దివంగత నేతలు సత్తయ్య, యశోదమ్మ జ్ఞాపకార్థం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అనీష్ గంగపుత్ర రూ. 50 వేల విరాళం అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు ముఠా జైసింహ చేతుల మీదుగా ఆలయ కమిటీ నాయకులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని సూచించారు. అమ్మవారి దేవాలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ బైరు గోవింద్‌రాజ్, గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగేందర్, సంఘం నాయకులు బాబూరావు, కొండల్, అభిషేక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న పిల్లలతో కార్పొరేటర్ రవిచారి

ఆత్మరక్షణ కోసం పిల్లలకు కరాటే నేర్పించాలి

కవాడిగూడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కోసం పిల్లలకు కరాటే నేర్పించాలని రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారి సూచించారు. బాగ్‌లింగంపల్లి ఎల్‌ఐజీ కమ్యూనిటీ హాలులో తైక్వాండో అసోసియేషన్ హైదరాబాద్ డిస్ట్రిక్ ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు. వందమంది పాల్గొన్నారు. విజేతలకు రవిచారి పలు రకాల కలర్ బెల్ట్‌లు ప్రదానం చేశారు. ఎల్‌ఐజీ కాలనీ అధ్యక్షుడు సిరిగిరి కిరణ్, బెల్ట్ ఎగ్జామినర్ మాస్టర్ కృష్ణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రముగ్ధులను చేసిన భక్తిసంగీత విభావరి

చిక్కడపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కళారవిందం సంస్థ ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయగానసభలో నిర్వహించిన భక్తిసంగీత విభావరి శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. సంస్థ అధినేత రామ్‌కుమార్, వైఎస్ రామకృష్ణ, కె.ఇ. రాజు, గాయనీమణులు అఖిల, రేణుక, శ్రీదేవి, లలితారామకృష్ణ పలు భక్తిగీతాలు ఆలపించారు. ఆర్కా గ్రూప్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ పాల్గొని గాయనీగాయకులను అభినందించారు.

నేడు సర్వ భాషా కవి సమ్మేళనం

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి ప్రతియేటా ప్రసారం చేసే సర్వభాషా కవి సమ్మేళనం గురువారం రాత్రి పది గంటలకు ప్రసారమవుతుందని ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం విభాగం అధిపతి వి.ఉదయ్‌శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవి సమ్మేళనంలో తెలుగు కవి డా.మల్లెగోడ గంగాప్రసాద్ 'వలస జీవి' కవితతో పాటు వివిధ భాషల కవితలకు అనువాదాలు ప్రసారమవుతాయన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని

జాతీయ స్థాయిలో మిలిటెంట్ పోరాటాలు



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, వీహెచ్, గుజ్జ కృష్ణ తదితరులు

బర్కత్‌పుర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ స్థాయిలో మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్టులలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వకపోతే త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో 14 బీసీ కులాల సమావేశం బుధవారం నిర్వహించారు. కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో బీసీ కులగణన చేపట్టాలని, పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 46 శాతానికి పెంచాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, క్రీమీలేయర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5, 6 తేదీల్లో చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తే జాతీయ స్థాయిలో బీసీ కులగణన చేపడతామన్నారు. బీసీలలో ఐక్యత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు రాజ్యాధికారం సాధించినప్పుడే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా విధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల్ కమిషన్ సిఫారసులను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడిగా గవ్వల భరత్‌కుమార్‌ను నియమిస్తూ ఎంపీ ఆర్.కృష్ణయ్య నియామక పత్రం అందజేశారు. బీసీ సంఘాల నేతలు సి.రాజేందర్, కోల జనార్దన్, సుధాకర్ ముదిరాజ్, లాల్‌కృష్ణ, నందకిషోర్, మట్ట జయంతిగౌడ్, కరుణశ్రీ, వెంకన్న, కృష్ణయాదవ్, శరత్‌గౌడ్ పాల్గొన్నారు.

యాగాలతో ఆధ్యాత్మిక భావన పెంపు

● హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



పుష్పార్చనలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, స్వామి సిద్దేశ్వరానంద భారతి స్వామి తదితరులు

కవాడిగూడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): యాగాల వల్ల ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందుతుందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. లోక కల్యాణం కోసం కుర్తాళం సిద్దేశ్వర పీఠం ఆధ్వర్యంలో కోటి ప్రత్యంగిరా మహాయాగం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి 88వ అవతరణ ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న కోటి ప్రత్యంగిరా మహాయాగంలో భాగంగా నాలుగో రోజు బుధవారం పుష్పార్చన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సిద్దేశ్వరానంద భారతీ మహాస్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు శోభారాజు, రమ్యానంద భారతి స్వామి, పీఠం కో-ఆర్డినేటర్ మునిపల్లె శ్రీనివాస్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మోచర్ల శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విశ్రాంత అధ్యాపకుల డిమాండ్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

ప్రొఫెసర్ కోదండరాం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

రాంనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ లెక్చరర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, తిరిగి గాడిలో పెట్టేందుకు రిటైర్డ్ అధ్యాపకులందరూ తమవంతు కృషి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. విద్యానగర్ ఆంధ్రమహిళా సభ కళాశాల ఆవరణలో తెలంగాణ రిటైర్డ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్(టీఆర్‌సీటీఏ) జనరల్ బాడీ సమావేశం, 2024 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ బుధవారం జరిగింది. కోదండరాం ముఖ్యఅతిథిగా పాల్గొని డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలు, యూనివర్సిటీలలో అధ్యాపకుల పోస్టులను గత ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధ్యాపకులకు సీనియారిటీ ప్రకారం రావాల్సిన ప్రమోషన్లు రాలేదన్నారు. ప్రైవేట్ కళాశాలలకు పెద్ద పీట వేశారన్నారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ సీహెచ్ పిచ్చయ్య, ఎ. పుల్లయ్య, సహాయ కార్యదర్శి కె. ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ అధ్యాపకులను సత్కరించారు.

మాల మహానాడు

రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్.డి.రావు

బర్కత్‌పుర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్.డి.రావు నియమితులయ్యారు. బుధవారం బషీర్‌బాగ్‌లో జరిగిన కార్యక్రమంలో రావును ప్రజా సైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు వేములవాడ రాజ్‌కుమార్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాల, మాదిగలు ఐక్యంగా తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వీఆర్. శ్రీనివాస్, డాక్టర్ గణేష్, భానుచందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఆనంద్‌గౌడ్

అంబర్‌పేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా జి.ఆనంద్‌గౌడ్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.యశ్వంత్, వర్కాల శ్రీకాంత్ ఆయనను శాలువాతో సత్కరించారు.

ఆర్. కృష్ణయ్య పీఆర్‌వోగా రాజ్‌కుమార్

రాంనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పీఆర్‌వోగా బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి. రాజ్‌కుమార్ నియమితులయ్యారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. తనను పీఆర్‌వోగా నియమించినందుకు ఆర్. కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి'

రాంనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బిహార్ మాజీ సీఎం, కర్పూరి ఠాకూర్‌కు శతజయంతి సందర్భంగా ఇటీవల భారతరత్న ఇచ్చిందని, కేంద్రం ఉత్తరాది నాయకులకు ఇచ్చిన ప్రాధాన్యతను దక్షిణాది నేతలకు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. భారతరత్న విషయంలో ఎన్టీఆర్‌కు కేంద్రం అన్యాయం చేస్తోందని విమర్శించారు. టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

లఘుచిత్రాల పోటీల తృతీయ విజేత 'దేవుడు'

చిక్కడపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పిన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన దశాబ్ద కాలంలో నిర్మించిన లఘుచిత్రాల పోటీలలో ఫాస్, ఇటక్లా సంస్థల అధినేత డా. కె. ధర్మారావు నిర్మించిన దేవుడు లఘుచిత్రం తృతీయ ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. చిక్కడపల్లిలోని ఫాస్, ఇటక్లా కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పిన్ సంస్థ అధినేత అఖిల్‌రెడ్డి దేవుడు లఘుచిత్ర నిర్మాత డా. కె. ధర్మారావును సన్మానించి అవార్డు, నగదు, సర్టిఫికెట్ బహూకరించారు. దేవుడు సినిమా దర్శకుడు ఏడుకొండలు, నటులు బీహెచ్‌ఈఎల్ ప్రసాద్, ఎస్. రాజు, పి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ పీఎస్‌ను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు

బర్కత్‌పుర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ పోలీస్ స్టేషన్‌ను ఉత్తరప్రదేశ్‌కు చెందిన ట్రైనీ ఐపీఎస్‌లు యతిన్‌శర్మ, కింగా శేరింగా బుధవారం సందర్శించారు. సీఐ రామలక్ష్మణ్‌రాజు వారికి కేసులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

'కళాకారులకు ఆదర్శప్రాయుడు సత్యదేవ్'

చిక్కడపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సత్యదేవ్ కీబోర్డు కళాకారుడిగా అసమాన ప్రతిభగలవారని ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం అన్నారు. ఆయన వ్యక్తిత్వం కళాకారులకు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. ప్రముఖ మహిళా సాంస్కృతిక సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో అంతా రామమయం శీర్షికతో ప్రముఖ గాయని రమణకుమారి, శాంతకుమారి, లక్ష్మి, శాంతిదినకర్, కనకల గానవిభావరి బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో రసరమ్యంగా జరిగింది. ఈ సందర్భంగా సత్యదేవ్‌ను సత్కరించారు. ప్రముఖ గాయకుడు త్రినాథరావు, సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంవీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

రవాణా శాఖ కానిస్టేబుల్స్ సంఘం కార్యవర్గం

బర్కత్‌పుర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జి.శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.ప్రతీష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడుగా గోవిందరాజ్, కోశాధికారిగా హనుమంతు, కార్యనిర్వాహక కార్యదర్శిగా నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.



కర్పూరి ఠాకూర్‌కు నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న..

బీసీలకు లభించిన గౌరవం

అంబర్‌పేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సోషలిస్టు నాయకుడు, బలహీన వర్గాలకు చెందిన బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న అవార్డు లభించడం బీసీలకు లభించిన గౌరవం అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కర్పూరి ఠాకూర్ శత జయంతి కార్యక్రమం అంబర్‌పేట బీసీ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆయన పేరుమీద వంద రూపాయల నాణెం విడుదల చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీసీ సంఘం నేతలు కుల్కచర్ల శ్రీనివాస్, కనకాల శ్యామ్, పి.బడే సాబ్, గొడుగు మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 5న ఓబీసీల ఆత్మీయ సమ్మేళనం

బర్కత్‌పుర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, నిధులు కేటాయించాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి, ఓబీసీ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు దానకర్ణాచారి డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఓబీసీల ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా బీసీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. మార్చి 5న రవీంద్రభారతిలో ఓబీసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓబీసీల సమస్యల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కుల సంఘాలు, సామాజిక వర్గాలతో ఫిబ్రవరి 1 నుంచి సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బీసీ సంఘాల నేతలు కె.అచ్చయ్య, బి.చిన్నయ్య, ఎస్.రవికుమార్, ఎం.జయప్రకాష్, సీ.హెచ్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ పేరుతో బ్లాక్ మెయిల్ రాజకీయాలు'

రాంనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ పేరుతో బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్న మందకృష్ణ సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించేది లేదని తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పోకల కిరణ్ మాదిగ హెచ్చరించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మందకృష్ణ మాదిగల ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు.

'పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం'

బర్కత్‌పుర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అన్నారు. బుధవారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎనిమియా ముక్త భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 16 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, డీపీఎంవో డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కాసుల అనసూయకు నివాళి

బర్కత్‌పుర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వీరభద్ర స్వామి సేవా సమితి వ్యవస్థాపకురాలు, సంఘ సేవకురాలు కాసుల అనసూయ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు నిజమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో ఆమె సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు భూరం శంకర్, ప్రొఫెసర్లు అఖిల్‌కుమార్‌ఝా, ఎస్.సూర్యప్రకాష్, రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు నివాళులర్పించారు. వీరభద్ర స్వామి సేవా సమితి ప్రధాన కార్యదర్శి కాసుల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల ట్యూషన్ ఫీజు పెంచాలి

రాంనగర్ , జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల ట్యూషన్ ఫీజు పదిశాతం పెంచాలని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరి సతీష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ట్యూషన్ ఫీజు పెంచకపోవడంతో కళాశాలల నిర్వహణ యాజమాన్యాలకు భారంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎ. వరదారెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడారు. అసోసియేషన్ కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ శాఖల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

రాంనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని రాష్ట్ర ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్స్ మెయింటెనెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ శాఖల్లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శులు తాతాచారి, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు షేక్ మహబూబ్, సభ్యులు పాల్గొన్నారు.

సొంత గూటికి మాజీ కార్పొరేటర్

కవాడిగూడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా బీజేపీకి దూరంగా ఉంటున్న దోమలగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ టి. రవీందర్ సొంతగూటికి చేరారు. ఓబీసీ(మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్‌ఎస్ నాయకుడు కాంగ్రెస్‌లో చేరిక

చిక్కడపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ గాంధీనగర్ డివిజన్ ప్రచార కార్యదర్శి ఎల్లూరి భాస్కర్‌రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేత ప్రవీల్ రాంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

హిట్ అండ్ రన్!

(5వ పేజీ తరువాయి)

కోసం ప్రయత్నిస్తుండగా బుధవారం మధ్యాహ్నం ఆ కారు(హుండయ్ వెర్నా)ఎస్ఆర్ నగర్ పోలీసుస్టేషన్ వద్ద హఠాత్తుగా ప్రత్యక్షమైంది. ఆ కారు అక్కడికి ఎలా వచ్చింది? అనేది పోలీసులు కూడా చెప్పలేకపోతున్నారు. మరోపక్క, ఈ కేసుకు సంబంధించి ద్వారంపూడి నాగ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. కారు నడిపిన నాగ ఓ రాజకీయ నాయకుడి బంధువు అని ప్రచారం జరుగుతోంది. మరోపక్క, పోస్టుమార్టం అనంతరం తారక్ రామ్ మృతదేహాన్ని బుధవారం సాయంత్రం తర్వాత జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ వద్దకు తీసుకొచ్చి అతడి బంధువులు ఆందోళనకు దిగారు.

నిందితులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మరో బ్రాంచి ప్రారంభం



హయత్‌నగర్ బ్రాంచిని ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర హయత్‌నగర్ శాఖను బుధవారం హైదరాబాద్ జోన్ జోనల్ మేనేజర్ సుశాంత్ కుమార్ గుప్తా, డిప్యూటీ జోనల్ మేనేజర్ మహమ్మద్ షజీబ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోహిత్ రిషి ప్రారంభించారు.. హోటల్ రాజధాని కాంప్లెక్స్, ఆటోనగర్‌లో ప్రారంభమైన ఈ శాఖ కస్టమర్లకు అందుబాటులోకి వచ్చింది. భారతదేశంలో 28 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాలలో 2200 కంటే ఎక్కువ శాఖలతో 30 మిలియన్ల కస్టమర్లకు సేవలందిస్తోందని... తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాల్లో 64 శాఖలున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు.

నగరం మరింత అద్భుతంగా..

(5వ పేజీ తరువాయి)

పేర్కొన్నారు.బార్కస్‌లో 50 పడకల ఆస్పత్రిని నిర్మించేందుకు రూ.9.50 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

అధునాతన ఫిష్ మార్కెట్..

నగరంలో కూరగాయలతో కలిపి అధునాతనమైన అతిపెద్ద ఫిష్ మార్కెట్‌ను నిర్మిస్తామన్నారు. గత ప్రభుత్వం హైదరాబాద్ కలెక్టరేట్ భవన నిర్మాణాన్ని పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం తప్పకుండా దీనిపై దృష్టి సారిస్తుందని, విశాలమైన స్థలంలో ఎవరూ ఊహించని విధంగా భారీ సముదాయాన్ని నిర్మిస్తామని చెప్పారు.

రేషన్‌కార్డులకు 10 లక్షల దరఖాస్తులు..

జిల్లాలో రేషన్‌కార్డులకు 10 లక్షల మంది, మరో 3 లక్షల మంది గ్యాస్, మహాలక్ష్మి, తదితర పథకాలకు దరఖాస్తు చేసుకున్నారని మంత్రి తెలిపారు.అర్హులందరికీ తప్పకుండా న్యాయం చేస్తామని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో ప్రతీ నియోజకవర్గానికి రూ.10 కోట్లు కేటాయిస్తానని తెలిపారు. త్వరలో జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహిస్తామన్నారు. 58, 59 జీవోలను అడ్డుపెట్టుకుని గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో ల్యాండ్ బ్యాంక్‌ను కాపాడే విషయంపై తహసీల్దార్లకు తగిన సూచనలిస్తామన్నారు. సమీక్షలో భాగంగా మంత్రి పొన్నం పలు శాఖల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్షలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కలెక్టర్ మధుసూదన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక ఘట్టాలకు వేదికగా గోల్కొండ



చిరంజీవితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు వేదిక గోల్కొండ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. యాదాద్రి భక్తులకు ఎంఎంటీఎస్ రైలు సేవలు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. గోల్కొండ కోటలో 3డీ మ్యాప్ ప్రొజెక్టర్, హై రెజల్యూషన్ లైట్స్ షోను రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్, సినీ నటుడు చిరంజీవితో కలిసి మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను సందర్శించే ప్రతి ఒక్కరూ గోల్కొండను వీక్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో లేజర్ షో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ షో తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లో ఉంటుందని, మన సంస్కృతి, చరిత్ర గురించి దీని ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. 1400 ఎల్ఈడీ లైట్లతో నిత్యం దేదీప్యమానంగా గోల్కొండ వెలుగొందేలా ఏర్పాట్లు చేశామన్నారు.

రూ.లక్షకు ఐదు లక్షలు

(5వ పేజీ తరువాయి)

యాడ్ చేశారు. డిసెంబర్ 29న రోలెక్స్ హైదరాబాద్‌లోని మెహిదీపట్నం వచ్చారు. నల్లటి కలర్‌లో ఉన్న బ్లాక్ కరెన్సీని వారి వద్ద ఉన్న కెమికల్‌లో కడిగి అది ఒరిజినల్ రూ. 500 నోటుగా మారడాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. రూ. లక్షకు రూ. 5 లక్షలు బ్లాక్‌కలర్ కరెన్సీ ఇస్తామని చెప్పడంతో విష్ణువర్ధన్‌రెడ్డి అంగీకరించాడు. సరిగ్గా వారం రోజుల్లోనే బాధితుడు రూ. 5లక్షలు రెడీ చేసుకున్నాడు. విషయం డేవిడ్‌కు చెప్పడంతో ఈ ఏడాది జనవరి 5న డేవిడ్ ప్రతినిధులైన మరో ఇద్దరు జోసెఫ్, కోంబి ఫ్రాంక్ సెడ్రిక్‌లు మాదాపూర్‌లోని ఒక హోటల్లో దిగారు. విషయం తెలుసుకున్న బాధితుడు రూ. 5లక్షలు తీసుకొని హోటల్‌కు వెళ్లాడు. అక్కడ రూ. 5లక్షలు తీసుకున్న జోసెఫ్, కోంబి ఫ్రాంక్ సెడ్రిక్‌లు ఒక ట్రంక్ పెట్టెను విష్ణు చేతికి ఇచ్చారు. అందులో రూ. 25 లక్షల విలువైన బ్లాక్ కలర్ కరెన్సీ ఉందని చూపించారు. అదే సమయంలో ఒక రకమైన పౌడర్‌ను విష్ణువర్ధన్ కూర్చున్న చోట చల్లడంతో మగతకు గురయ్యాడు. అనంతరం ఆ ట్రంక్‌పెట్టెను తీసుకొని విష్ణు ఇంటికి వెళ్లి కెమికల్‌లో ముంచి ఎంత క్లీన్ చేసినా తెల్లకాగితాలే వస్తున్నాయి.. కానీ, కరెన్సీ నోటు కాలేదు. దాంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించి షాకయ్యాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీపీ ఆదేశాలతో మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు రంగంలోకి దిగారు.

సాంకేతిక ఆధారాలు సేకరించి ముఠాలోని కోంబి ఫ్రాన్స్ సెడ్రిక్, గోయిటా సౌన్‌గాలోను అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. చాకచక్యంగా విదేశీ ముఠాను పట్టుకున్న మల్కాజిగిరి ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ రాము టీమ్‌ను, డీసీపీ గిరిధర్, ఏసీపీ వాసును సీపీ అభినందించారు.

564 మంది అరెస్ట్

ఆఫ్రికన్ దేశాలకు చెందిన 564 మంది గత మూడేళ్లలో దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడినట్లు గణాంకాలు చెబుతున్నాయని రాచకొండ పోలీసులు వెల్లడించారు. ఆఫ్రికన్ దేశాల ఎకానమీలో పదిశాతం మోసాలతో సంపాదించిన డబ్బు ఉంటుందన్నారు.